సాక్షి
మెదక్
ఆదివారం । 27 । జూలై । 2025



## కోవెలలో కొలిచి.. సేవలలో నిలిచి

సండే స్పెషల్

కనిపెంచే తల్లిదండ్రులెప్పుడూ కనిపించే దైవాలే. అందుకే మాతృదేవోభవ..పితృదేవోభవ అంటారు. జన్మనిచ్చిన రుణం ఎలా తీర్చుకోగలం? ఇక కళ్లెదురుగా ఉన్న అమ్మనాన్నలకు కాన్కలిచ్చి వారికళ్లలో ఆనందాన్ని చూసుకుంటున్నారు. కాలం చేసిన తల్లిదండ్రులకు స్మరణగా ఎందరో బిడ్డలు తమ సేవల రూపంలో జన్మ రుణం తీర్చుకుంటున్నారు. అలా తల్లిదండ్రులకు సేవలు చేస్తూ...చనిపోతే వారిని కోవెలలో కొలుస్తున్న కొంతమంది బిడ్డల రుణానుబంధ కథనాలు ఈ వారం సండే స్పెషల్...

8లో



## న్యూస్‌రీల్

### కరెంట్‌తో జాగ్రత్త

**విద్యుత్‌శాఖ ఎస్‌ఈ నారాయణనాయక్**

**మెదక్ కలెక్టరేట్:** కరెంట్ వినియోగం పట్ల రైతులు, ఇతర విద్యుత్తు వినియోగదారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని మెదక్ విద్యుత్ శాఖ ఎస్ఈ నారాయణనాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున ఇళ్లు, పొలాల వద్ద కరెంట్ పరికరాలను తడి చేతితో తాకరాదన్నారు. అలాగే కరెంట్ పోల్స్‌ను ముట్టుకోవద్దన్నారు. ఎక్కడైనా కరెంట్ తీగలు తెగిపడితే వెంటనే సమాచారం అందించాలన్నారు.

### పోచారం ప్రాజెక్టుకు వరద



డ్యాంలో నీటి మట్టం

**హవేళిఘణాపూర్(మెదక్):** జిల్లా సరిహద్దులోని పోచారం ప్రాజెక్టుకు ఎగువన భారీ వర్షాలు కురవడంతో నీరు చేరుతుంది. గతంలో నీరులేక వెలవెలబోయిన ప్రాజెక్టు 12 ఫీట్ల మేర నీరు చేరింది. దీంతో కొన్ని రోజులుగా కామారెడ్డి జిల్లాలో కురుస్తున్న వర్షాలకు తోడు వాగుల నుంచి నీరు వస్తుండడంతో నీటిమట్టం రోజురోజుకు పెరుగుతోంది. ఈ డ్యాం నిండితే పర్యాటకుల సందడి పెరగనుంది.

### నిల్వ నీటిని తీసివేయాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ రాజ్‌నారాయణ

**రామాయంపేట(మెదక్):** భారీ వర్షాలతో పంట చేలల్లో నిలిచిన నీటిని వెంటనే తీసివేయాలని వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) రాజ్‌నారాయణ రైతులకు సూచించారు. శనివారం శివాయపల్లి, కోమటిపల్లి, రామాయంపేటలో పంటలను పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పంటలకు ఎరువులు, క్రిమి సంహారక మందులు చల్లవద్దన్నారు. ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉండటంతో వ్యవసాయ బోర్ల వద్ద మోటర్లు ఆన్ చేయవద్దని చెప్పారు. వరి నారు పోయడానికి తగినంత సమయం లేనందున, వెదజల్లే పద్ధతి ఎంచుకోవాలని తెలిపారు. పత్తికి తెగులు ఆశించే అవకాశం ఉందని, మూడు గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ మందు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు.

### రోడ్లను బాగు చేసేది ఎప్పుడు?



నిరసన తెలుపుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, పార్టీ శ్రేణులు

**పటాన్‌చెరు టౌన్:** ప్రభుత్వాలు మారిన రోడ్ల దుస్థితి మాత్రం మారడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. శనివారం మండలంలోని ఇంద్రేశం నుంచి దౌల్తాబాద్ వరకు రహదారి బాగు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు వీరేశం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో పాల్గొని మాట్లాడారు. ఆరు సంవత్సరాలుగా రహదారి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి, నూతన రోడ్లను వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, జిల్లా నాయకులు అల్లం రాజిరెడ్డి, జిన్నారం మండల అధ్యక్షుడు జగన్, బీజేపీ మోర్చా అధ్యక్షుడు రవీందర్, మండల ఉపాధ్యక్షులు ధనుంజయ్ గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఇన్‌చార్జి వైద్యాధికారిగా నాగనిర్మల



బాధ్యతలు స్వీకరిస్తున్న నాగనిర్మల

**సంగారెడ్డి:** జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారిగా నాగనిర్మల శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈమె ఇప్పటివరకు ఎంసీహెచ్‌లో పీఓగా పనిచేశారు. ఇప్పటివరకు ఉన్న అధికారి గాయత్రి కోహీర్ ఆస్పత్రికి రెగ్యులర్ పోస్టుకు వెళ్లారు.

# ఐరిస్‌తో పింఛన్



చేయూత పింఛన్‌దారులకు ఇక నుంచి ముఖ గుర్తింపు ద్వారా పింఛన్ చెల్లించనున్నారు. ఈనెల 29 నుంచి ఎఫ్‌ఆర్‌ఎస్ విధానం అమల్లోకి తెచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. దీంతో బయోమెట్రిక్ సమస్యలకు తెరపడనుంది. అయితే మొదటగా పోస్టాఫీస్‌లలో పింఛన్ తీసుకునే వారికి ఎఫ్‌ఆర్‌ఎస్ విధానం అమలు చేయనున్నారు. జిల్లాలో మొత్తం 1,16,227 మంది పింఛన్‌దారులుండగా, అందులో 50,163 మంది పోస్టాఫీస్‌ల నుంచి పింఛన్ తీసుకుంటున్నారు. – పాపన్నపేట(మెదక్)

**ఈనెల 29 నుంచి అమలు**
- ఫింగర్ ప్రింట్ ఇబ్బందులకు చెక్
- జిల్లాలో 1,16,227 పింఛన్‌దారులు

జిల్లాలో మొత్తం 1,16,227 మంది పింఛన్‌దారులు ఉన్నారు. అందులో 46,251 వితంతు, 39,934 వృద్ధాప్య, 15,826 బీడీ కార్మికులు, 8,622 దివ్యాంగులు, 4,271 ఒంటరి మహిళలు, 928 గీత కార్మికులు, 495 చేనేత కార్మికులు ఉన్నారు. వీరి సంఖ్య నెల నెలా మారుతుంది. సాధారణ పింఛన్‌దారులకు రూ. 2,016, దివ్యాంగులకు రూ. 4,016 ఇస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది వృద్ధులు, వితంతువులు ఉన్నారు.

**పండుటాకుల అవస్థలు**

వేలిముద్రలు అరిగిపోయి కొందరు.. బ్యాంకుల్లో అప్పు ఉండటం వల్ల మరికొందరు పింఛన్‌దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరికొంత మందికి బ్యాంకు ఖాతాల్లో పింఛన్లు పడుతున్నాయి. అప్పటికే సదరు పింఛన్‌దారు గాని, అతడి కుటుంబీకులకు బ్యాంకులో బకాయి ఉంటే, వీరి పింఛన్‌ను అధికారులు హోల్డ్‌లో పెడుతున్నారు. దీంతో వయోభారంతో ఏ పని చేయలేని స్థితిలో ఉన్న పండుటాకులు పింఛన్ వచ్చినా, వాటిని తీసుకోలేని పరిస్థితిలో పస్తులుంటున్నారు. అనారోగ్యంతో బాధ పడుతున్నా, డబ్బులు లేక మందులు కొనుక్కోలేని పరిస్థితిలో ఉంటున్నారు. ఇక పింఛన్ల చెల్లింపులో కొంతమంది ప్రైవేట్ బ్యాంకుల ఏజెంట్ల వద్ద డబ్బులు తీసుకుంటున్నారు. అందుకు గాను సదరు ఏజెంట్లు పింఛన్‌దారుల నుంచి రూ.100కు రూ.10 మినహాయించుకొని ఇస్తున్నారు. ఇలాంటి ప్రైవేట్ వ్యవస్థలు జిల్లాలో 15 వరకు ఉన్నట్లు తెలుస్తుంది.

**పోస్టాఫీసుల్లో ఎఫ్‌ఆర్‌ఎస్ సిస్టం**

ఈనెల 29 నుంచి పోస్టాఫీసుల్లో మొదటి విడతగా ఫేసియల్ రికగ్నిషన్ సిస్టంతో పింఛన్‌లు చెల్లించనున్నారు. ఫొటో తీసి ఆధార్‌తో సరిపోల్చుకొని యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. పోస్ట్‌మాస్టర్లు, పోస్ట్‌మ్యాన్‌లు, పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లకు శిక్షణ ఇచ్చారు. ఇందుకోసం కొత్త ఫోన్‌లు కొనుగోలు చేయనున్నారు. ఫొటోలు తీయలేని పరిస్థితి ఉంటే, బయోమెట్రిక్ ద్వారా పింఛన్‌లు ఇస్తారు. బయోమెట్రిక్, ముఖ గుర్తింపు పని చేయని వారుంటే పంచాయతీ కార్యదర్శులు వేలి ముద్రలు వేసి ఇస్తారు. ఈ విషయమై డీఆర్డీఓ శ్రీనివాస్‌ను వివరణ కోరగా పోస్టాఫీస్‌లలో ఎఫ్ఆర్ఎస్ విధానం ద్వారా పింఛన్‌లు పంపిణీ చేయడానికి సన్నాహాలు జరుగుతున్నట్లు చెప్పారు.

# ‘మధ్యాహ్న’ వంటకు గ్యాస్

**సర్కారు బడుల్లో పొగ కష్టాలకు చెక్**
- త్వరలో గ్యాస్ సిలిండర్ల సరఫరా
- జిల్లాలో 1,421 మంది వంట కార్మికులు



రామాయంపేట జెడ్పీ స్కూల్‌లో వంట చేస్తున్న మహిళలు

**రామాయంపేట(మెదక్):** ప్రభుత్వ పాఠశాలల్లో కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న కార్మికుల కష్టాలు తీరనున్నాయి. మధ్యాహ్న భోజనం వండేందుకు ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్లను అందించాలని నిర్ణయించింది. తాజాగా ఆదేశాలు సైతం జారీ చేసింది. ఈ మేరకు ప్రతి స్కూల్‌కు ఎల్‌పీజీ కనెక్షన్లు ఇప్పించాలని కలెక్టర్‌కు సూచించింది. త్వరలో సివిల్ సప్లై అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారి, గ్యాస్ ఏజెన్సీలు, ఇతర అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి విధి విధానాలు చర్చించనున్నట్లు సమాచారం. జిల్లాలో మొత్తం 885 ప్రభుత్వ పాఠశాలలుండగా, వీటిలో 261 స్కూళ్లలో అక్షయపాత్ర ద్వారా భోజనం అందజేస్తున్నారు. మిగితా 624 స్కూళ్లలో 1,421 మంది మహిళా కార్మికులు వంట చేస్తున్నారు. కట్టెల పొయ్యిపై వంట చేస్తుండటంతో పొగతో తరచూ అస్వస్థతకు గురై వ్యాధుల బారిన పడుతున్నారు. దీంతో పాటు పర్యావరణ పరి రక్షణ సైతం దెబ్బతింటుంది. గతంలో జిల్లా పరిధిలోని సుమారు 50 స్కూళ్లలో గ్యాస్‌పై వంట చేసిన కార్మికులు తమకు గిట్టుబాటు కావడం లేదనే ఉద్దేశంతో తిరిగి కట్టెల పొయ్యిపైనే వంట చేస్తున్నారు.

**సంతోషంగా ఉంది**



గత కొన్నేళ్లుగా కట్టెల పొయ్యిపై వంట చేస్తూ కష్టాలు పడుతున్నాం. పొగతో తరచూ దగ్గు, జ్వరం వస్తుంది. ఇన్ని రోజులకు అధికారులు స్పందించడం సంతోషంగా ఉంది. వెంటనే మాకు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయాలి.

– లక్ష్మి, వంట కార్మికురాలు, రామాయంపేట

**కార్మికుల సంక్షేమం కోసమే..**

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండుతున్న కార్మికుల సంక్షేమం కోసం విద్యాశాఖ ఈనిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి విధి విధానాలు ఇంకా రాలేదు. విద్యాశాఖ నిర్ణయంతో జిల్లా పరిధిలో 1,421 మంది కార్మికులకు లబ్ధి చేకూరనుంది. – రాధాకిషన్, డీఈఓ

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి శరత్**



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న శరత్

**నర్సాపూర్:** వర్షాల నేపథ్యంలో జిల్లాలోని అన్నిశాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి శరత్ అన్నారు. శనివారం ఆర్డీఓ కార్యాలయంలో జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముంపు ప్రాంతాలు, శిథిలావస్థకు చేరిన ఇళ్లను గుర్తించి వాటిలో నివసిస్తున్న ప్రజలను పునరావస ప్రాంతాలకు తరలించాలని సూచించారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొవడానికి, సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కంట్రోలు రూం ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు. జిల్లాలో యూరియా సమృద్ధిగా ఉందని, యూరియా కృత్రిమ కొరత సృష్టించకుండా మండల స్పెషల్ ఆఫీసర్లు చూడాలన్నారు. ఎరువుల దుకాణాలను వారానికి ఒకసారి తనిఖీ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అంతకుముందు స్థానిక రాయరావు చెరువును పరిశీలించారు. చెరువు కట్ట నాణ్యత, ఇతర వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు అలుగు పారే సమయంలో అటు వైపు ఎవరూ వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేశ్, ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కంట్రోల్‌రూం ఏర్పాటు

**మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి**

**మెదక్ మున్సిపాలిటీ:** మెదక్ మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు, మూడు రోజులుగా భారీ వర్షాలు పడుతున్నందున పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రెస్క్యూ టీంను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టణ ప్రజలు ఆపద సమయంలో కంట్రోల్ రూం ఫోన్ నంబర్ 9154293346 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## ప్రతీ ఫిర్యాదుపై స్పందించాలి

**ఎస్పీ శ్రీనివాసరావు**



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

**టేక్మాల్(మెదక్):** పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పరిసరాలను పరిశీలించి రికార్డును తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పోలీస్ సిబ్బంది విధులు, నేరాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, ఫిర్యా దులపై తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఎన్నికల సమీపిస్తున్న వేళ సిబ్బంది విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరాలను అదుపు చేసేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. సమస్యలు ఉంటే నేరుగా సంప్రదించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, అల్లాదుర్గం సీఐ రేణుకరెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా ప్రభుత్వం

**కలెక్టర్ రాహుల్‌రాజ్**



తూప్రాన్‌లో రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్సీ యాదవరెడ్డి

**తూప్రాన్/మనోహరాబాద్(తూప్రాన్):** నిరుపేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న వారికి కొత్త రేషన్‌కార్డులు అందిస్తుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శనివారం తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఆర్డీఓ జయచంద్రారెడ్డితో కలిసి నూతనంగా మంజూరైన అయిన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 45 వేల కుటుంబాలు కొత్త రేషన్‌కార్డుల ద్వారా లబ్ధి చేకూరనుందని తెలిపారు. ప్రభుత్వం ముందు చూపుతో వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మూడు నెలల రేషన్ ఒకేసారి అందించిన విషయం గుర్తు చేశారు. కాగా రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. అనంతరం తూప్రాన్ పట్టణంలోని తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించారు. జిల్లాలో యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోయిందన్న వదంతులను రైతులు నమ్మవద్దని అన్నారు. రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. అనంతరం మనోహరాబాద్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు బోధన చేశారు. అనంతరం పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్, ఆర్డీఓ జయచంద్రారెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ర్యాకల కృష్ణాగౌడ్, శోభన్‌రాజ్‌గౌడ్, నవీన్‌కుమార్, యాదగిరి, బీఆర్ఎస్ నాయకులు పురం రవి, బాబుల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సర్దుబాటు వివాదం

**ప్రభుత్వ జాబితాను తప్పపడుతున్న సంఘాలు**
- ఇష్టారాజ్యంగా చేశారని ఆరోపణలు
- జీఓ 25 నిబంధనలు పాటించలేదని ఆవేదన
- జిల్లాలో 222 మంది టీచర్ల సర్దుబాటు



**మెదక్ కలెక్టరేట్:** ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ జిల్లాలో వివాదాస్పదమవుతోంది. కనీస నిబంధనలు పాటించలేదని, అధికారులు ఇష్టారీతిగా వ్యవహరించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జూనియర్లను సర్దుబాటు చేయాల్సి చోట, సీనియర్లను ఆయా పాఠశాలలకు కేటాయించడం, మండల పరిధిలో కాకుండా ఇతర ప్రాంతాలకు పంపడంపై ఉపాధ్యాయ సంఘాలు పెదవి విరుస్తున్నాయి. సర్దుబాటుతో 1 నుంచి 60 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు ఉంటే 5 తరగతులు 18 సబ్జెక్టులు ఎలా బోధిస్తారని వాపోతున్నారు. మరోవైపు విద్యాశాఖ సమావేశాలు, శిక్షణ, రిపోర్టులు ఎలాగూ ఉంటాయి. ఫలితంగా క్షేత్రస్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్య ఆచరణలో సాధ్యం కాదని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వ జీఓ 25 ప్రకారం సర్దుబాటు చేసి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు.

**జిల్లావ్యాప్తంగా 901 పాఠశాలలు**

జిల్లాలో ప్రాథమిక 627, ప్రాథమికోన్నత 128, ఉన్నత 146 కలిపి మొత్తం 901 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో దాదాపు 83 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మొత్తం 4,016 ఉపాధ్యాయ పోస్టులు ఉండగా, ప్రస్తుతం 3,529 మంది పని చేస్తున్నారు. 487 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలోని ఆయా పాఠశాలల్లో అవసరానికి మించి ఉపాధ్యాయులు ఉన్న స్కూళ్ల నుంచి అవసరమున్న చోటుకు 261 మంది టీచర్లను సర్దుబాటు చేశారు. ఇందుకు సంబంధించి డీఈఓ ఉత్తర్వులు సైతం జారీ చేశారు. వీరిలో 179 మంది ఎస్జీటీలు, 82 మంది స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. అలాగే 240 మంది ఉపాధ్యాయులను ఒకే మండలంలో సర్దుబాటు చేయగా, 21 మందిని ఇతర మండలాలకు పంపించారు. కాగా ఈ ప్రక్రియతో ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు ప్రయోజనం చేకూరనుంది.

**శాస్త్రీయంగా జరగలేదు**



ప్రభుత్వం జారీ చేసిన జీఓ 25 ప్రకారం ఉపాధ్యాయుల సర్దుబాటు జరగలేదు. ఒక్కో చోట ఒక్కోలా వ్యవహరించారు. కొంతమంది ఉపాధ్యాయులకు సర్దుబాటు విషయంలో అన్యాయం జరిగింది. అదనంగా ఉన్న ఉపాధ్యాయులను అవసరమున్న చోట సబ్జెక్టు వారీగా, కాంప్లెక్స్ వారీగా మండల, జిల్లా స్థాయిలో సర్దుబాటు చేయాలి. డీఈఓ స్పందించి శాస్త్రీయంగా జరగని సర్దుబాటును సరిచేయాలి.

– మల్లారెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

**అవసరం మేరకే..**



అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సర్దుబాటు ప్రక్రియ చేపట్టింది. ప్రభుత్వ నిబంధనలను పాటించాం. జిల్లాలో అవసరానికి మించి ఉన్న పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను పోస్టులు ఖాళీగా చోటకు కేటాయించాం. దీంతో విద్యార్థులకు న్యాయం జరుగుతుంది. అక్కడక్కడ పొరపాట్లు జరిగి ఉంటే పునఃపరిశీలించి సరిచేస్తాం.

– రాధాకిషన్, డీఈఓ

# బురదదారి.. పడతారు జారి

**అధ్వానంగా డబుల్ బెడ్రూం కాలనీ రోడ్డు**



డబుల్ బెడ్రూం కాలనీలో రోడ్డు దుస్థితి

**మెదక్‌జోన్:** జిల్లా కేంద్రానికి 4 కిలోమీటర్ల దూరంలోని పిల్లికోటాల్ శివారులో నిరుపేదలతో పాటు జర్నలిస్టులకు ప్రభుత్వం వెయ్యికిపైగా ఇళ్లను గతంలో కేటాయించింది. అయితే వసతులు మాత్రం మరిచింది. చిన్నపాటి వర్షం కురిసినా కాలనీ రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. రాత్రి సమయంలో ఎవరికైనా ఆపద వస్తే కనీసం 108 సైతం రాని దుస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనంపై కాలనీకి వెళ్లాలంటే అపసోపాలు పడాల్సి వస్తోంది. డబుల్ బెడ్రూం ఇళ్లకు రోడ్లు వేయాలని పలుమార్లు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకుండా పోయిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం డబుల్‌బెడ్రూం కాలనీల్లో 2 వేల పైచిలుకు జనాభా ఉంటున్నారు. రోడ్డుపై పనినిమిత్తం బయటకు వెళ్లలేక.. ఇంటి రాలేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి డబుల్‌బెడ్రూం ఇళ్లకు రోడ్లు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

**అడవిలో ఉన్నట్లు ఉంది**



పేరుకే మెదక్‌లో ఉన్నాం. కానీ అడవిలో ఉన్నట్లు ఉంది మా పరిస్థితి. చిరుజల్లులు కురిసినా రోడ్లన్నీ బురదమయంగా మారి ఇంట్లో నుంచి కాలు బయట పెట్టలేని పరిస్థితి ఏర్పడింది. రోడ్డు వేయాలని ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవటం లేదు.

– తుల్జమ్మ, డబుల్‌బెడ్రూం కాలనీ

**అంబులెన్స్ రావడం లేదు**



రోడ్లు సరిగా లేక అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా రావటం లేదు. వర్షాకాలం వచ్చిందంటే ఎంలాంటి పండగలు, శుభకార్యాలు చేయడం లేదు. రోడ్లు బాగలేక మా ఇళ్లకు ఎవరూ రావటం లేదు. వేలాది రూపాయలు వెచ్చించి ఫంక్షన్‌హాళ్లలో చేయాల్సి వస్తోంది. – విగ్నేశ్, స్థానికుడు



## సింగూరుకు కొనసాగుతున్న వరద

**పుల్‌కల్(అందోల్):** సింగూరు ప్రాజెక్టులోకి వరద కొనసాగుతోంది. వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్టులోకి వరద నీరు చేరుతుంది. శనివారం డ్యాంలోకి 1,131 క్యూసెక్కుల వరద చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 29.917 టీఎంసీలకు గాను.. ప్రస్తుతం 19.499 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు నీటి వరద చేరుతుండటంతో పర్యాటకుల సందడి పెరిగింది.

## 20 ఏళ్ల నుంచి సేవా కార్యక్రమాలు



విద్యార్థులకు నగదు పురస్కారం అందజేస్తున్న వెంకట్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): తండ్రి పేరిట 20 ఏళ్ల నుంచి విద్యార్థులకు ఆర్థికసాయంతోపాటు పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నాడు. మండల పరిధిలోని గోమారం గ్రామానికి చెందిన న్యాయవాది దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి తన తండ్రి రిటైర్డ్ ఉపాధ్యాయుడు నర్సింహారెడ్డి జ్ఞాపకార్థం గోమారం, గుమ్మడిదల పాఠశాలల్లో పదిలో మెరిట్ మార్కులు సాధించిన మొదటి విద్యార్థికి రూ.10 వేలు, రెండవ విద్యార్థికి రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం చేస్తున్నారు. గోమారం, బిజ్లిపూర్ పాఠశాలలకు ఫర్నీచర్, కంప్యూటర్లు అందజేశాడు.

## తండ్రి పేరిట విద్యార్థులకు సాయం



ఎంఈఓ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేస్తున్న సాయం(ఫైల్)



వెంకట్‌రెడ్డి దంపతులు

జహీరాబాద్: కోహీర్ మండలంలోని బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన చర్ల వెంకట్‌రెడ్డి అమెరికాలో స్థిరపడినా తన తండ్రి చర్ల రాంరెడ్డి జ్ఞాపకార్థం గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. మూడు దశాబ్దాల క్రితం అమెరికా వెళ్లి స్థిరపడ్డారు. 2014లో గ్రామస్తుల కోరిక మేరకు రూ.5లక్షలతో తన తండ్రి పేరిట బస్ షెల్టర్ నిర్మించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు పదేళ్లుగా ప్రతి ఏటా 6 నుంచి 10వ తరగతి వరకు ప్రతిభ గల ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేసి వారికి రూ.3వేలు అందజేస్తున్నారు.

# కోవెలలో కొలిచి.. సేవలలో నిలిచి..

జన్మనిచ్చిన తల్లిదండ్రులు దేవుళ్లతో సమానం అంటారు పెద్దలు. వారి జ్ఞాపకార్థం పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇంకొంతమంది తల్లిదండ్రులకు గుడి కట్టించి నిత్యం వారిని కొలుస్తున్నారు. అమ్మానాన్నలపై ఉన్న ఆప్యాయత, అనురాగం, ఆత్మీయ బంధాన్ని చాటుతూ వారికి బహుమతులిస్తూ సంతోషాన్ని పంచుకుంటున్నారు. నేడు జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

## కనిపించే దైవం తల్లిదండ్రులు

### అమ్మానాన్నల జ్ఞాపకార్థం పలు సేవా కార్యక్రమాలు

### నేడు జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం



నర్సింలు



పొలంలో తల్లిదండ్రులకు నర్సింలు కట్టించిన గుడి



## అమ్మ పేరిట చలివేంద్రాలు

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బుచ్చిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తల్లిదండ్రుల ఆశీస్సులతోనే ఈ స్థాయిలో ఉన్నానని తెల్లాపూర్ మున్సిపాలిటీకి చెందిన మల్లేపల్లి బుచ్చిరెడ్డి పేర్కొన్నారు. వారికి ఏం చేసినా రుణాన్ని తీర్చుకోలేమని చెప్పారు. అమ్మ లక్ష్మమ్మ 2016లో మృతి చెందగా, నాన్న శంకర్ రెడ్డి రెండేళ్ల క్రితం చనిపోయారు. 2016 నుంచి అమ్మ పేరిట ప్రతి వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ఏటా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు ఇస్తున్నారు. అలాగే తల్లిదండ్రుల పేరిట నిరుపేదలకు ఆర్థిక సాయం అందజేస్తున్నారు.

## తండ్రికి బహుమతిగా కారు



కుమారుడు ఇచ్చిన కారుతో కాట శంకర్

జహీరాబాద్ టౌన్: కుమారుడు తన తండ్రికి గిఫ్ట్ ఇవ్వడం అనేది తమకున్న ప్రేమ, గౌరవాన్ని వ్యక్తీకరించే మార్గం. జహీరాబాద్ పట్టణంలోని సాయిరాం నగర్ కాలనీకి చెందిన కాట శంకర్ కుమారుడు శ్రీకాంత్ తండ్రికి అందమైన ఇల్లు కట్టించి, కారును బహుమతిగా ఇచ్చాడు. సామాన్య కుటుంబానికి చెందిన శంకర్ తన కొడుకును కష్టపడి చదివించాడు. జీవితంలో ప్రయోజకుడు అయిన కొడుకు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. తల్లి లేకపోవడంతో తండ్రి సంతోషం కోసం అందమైన ఇల్లు కట్టించాడు. ఓ రోజు అమెరికా నుంచి ఇంటికి వస్తూనే కొడుకు రూ.15 లక్షల కారును కొనుగోలు చేసి తాళం చెవిని తన తండ్రి చేతిలో పెట్టడంతో శంకర్ ఆనందానికి అవధులు లేవు. ఆ తరువాత కారు ముందు ఫొటోలు దిగారు.

## తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు



మినీ వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న అజయ్ మారుతీ రావు

హత్నూర( సంగారెడ్డి): మండల కేంద్రానికి చెందిన స్వర్గీయ బాదే పద్మాబాయి, బాలకిషన్ రావు జ్ఞాపకార్థంగా వారి తనయుడు అజయ్ మారుతీ రావు మూడేళ్లుగా గ్రామంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హత్నూర గ్రామంలో జరిగే కూరగాయల సంత వద్ద ప్రజల దాహార్తి తీర్చేందుకు మినీ వాటర్ ట్యాంకును ఏర్పాటు చేశారు. పదో తరగతి ఇంటర్మీడియెట్ పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందిస్తున్నారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గ్రామపంచాయతీకి వీధిలైట్లను అందించారు. వారి పేరిట వృద్ధులకు, అనాథలకు సహాయం చేస్తున్నారు. గ్రామంలోని యువతను ప్రోత్సహిస్తూ క్రీడా సామగ్రిని సైతం అందించారు.

## ఆలయాలకు విరాళాలు.. పెళ్లిళ్లకు పుస్తెమెట్టెలు



చిట్కుల్‌లో యాదవసంఘానికి నిర్మించి ఇచ్చిన మండపంలో తారా విష్ణువర్ధన్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చిట్కుల్ గ్రామానికి చెందిన తారా విష్ణువర్ధన్ రెడ్డి, తన తండ్రి అంజిరెడ్డి జ్ఞాపకార్థం ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. గ్రామంలో యాదవసంఘం సభ్యుల కోరిక మేరకు రూ. 2 లక్షలతో వినాయక మండపం నిర్మించారు. ప్రతి ఏటా ఉన్నత, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, ప్యాడ్లు, నోట్ బుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేస్తున్నారు. అంగన్‌వాడీ చిన్నారులకు ప్లేట్లు, పలకలు, పెన్సిళ్లు అందజేస్తారు. విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేస్తారు. గ్రామ పంచాయతీకి కార్పెట్లు, కార్మికులకు బూట్లు, టోపీలతో పాటు, గ్రామానికి వీధి దీపాలు సైతం అందించారు. ఆలయాల నిర్మాణాలకు విరాళాలు, నిరుపేద ఆడపిల్లల పెళ్లిళ్లకు పుస్తెమెట్టెలు అందజేశారు. తాను చేసే సేవా కార్యక్రమాలకు తండ్రి పేరిట టీఏఆర్ ట్రస్ట్ పెట్టాడు.

## తన రక్తంతో తల్లిదండ్రుల చిత్రపటం





తన రక్తంతో గీసిన చిత్రపటాన్ని పెళ్లిరోజు అమ్మానాన్నకు ఇస్తున్న మణికంఠ స్వరాజ్

దుబ్బాక: కనిపెంచిన తల్లిదండ్రులే మొదటి దైవం. జన్మనిచ్చిన తల్లిదండ్రుల చిత్రాలను తన రక్తంతో గీసి జూన్ 11న జరిగిన 43వ వివాహ వార్షికోత్సవానికి బహుమతిగా ఇచ్చాడు దుబ్బాకకు చెందిన చింత మణికంఠ స్వరాజ్. ప్రముఖ వ్యాపారవేత్త, దుబ్బాక ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చింత రాజు, స్వరూపరాణిల కుమారుడు మణికంఠ(29). ఉన్నత చదువులు చదివిన ఆయన ఎక్కడో ఉద్యోగం చేయకుండా రైస్‌మిల్‌తో పాటు పలు వ్యాపారాలు చేస్తూ తనతో పాటు మరో వంద మందికి ఉపాధి కల్పిస్తున్నాడు. సామాజిక సేవా కార్యక్రమాల్లో సైతం ముందుంటున్నాడు. తన తల్లిదండ్రులకు ఇటీవల తన రక్తంతో గీసిన వారి చిత్రపటాన్ని బహుమతిగా ఇచ్చాడు. తల్లిదండ్రుల పెళ్లిరోజున పేదలకు దుస్తులు, విద్యార్థులకు, అనాథ, వృద్ధాశ్రమాల్లో దుప్పట్లు, ప్లేట్లు పంపిణీ చేసి, భోజనాలు పెడతాడు. జులై 26న అమ్మ స్వరూపరాణి బర్త్‌డే ఉండటంతో అమ్మానాన్నలను ఫ్లైట్‌లో కాశీ పుణ్యక్షేత్రానికి పంపించాడు.



## తల్లిదండ్రుల పేరు చిరస్థాయిగా..



బాలమల్లయ్య

నంగునూరు(సిద్దిపేట): తల్లిదండ్రుల పేరు చిరస్థాయిగా నిలవాలని ఊరికి ఉపకారం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు గట్లమాల్యాలకు చెందిన చెలిమిల్ల బాలమల్లయ్య. వ్యాపార రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడినా గ్రామంలో ఏ కార్యక్రమం నిర్వహించినా తన తల్లిదండ్రులు చెలిమిల్ల పెద్ద కొమురయ్య, లక్ష్మి చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందిస్తున్నారు. విద్యార్థులు భోజనం చేసేందుకు ఇబ్బందులు పడటంతో రూ.2 లక్షలతో వంట గది, షెడ్డు నిర్మించారు. అలాగే ఎస్సీ బాలికల హాస్టల్‌కు భవనం లేకపోవడంతో ఉచితంగా స్థలం ఇవ్వడంతో ప్రభుత్వం భవనం నిర్మించింది. గ్రామంలో పశువుల హాస్టల్ సముదాయానికి రెండెకరాలు ఇవ్వడంతో భవనం నిర్మించారు.



వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు పెడుతున్న డాక్టర్ జానకిరాములు

## తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేం..

బెజ్జంకి(సిద్దిపేట): మండల కేంద్రానికి చెందిన వైద్యులు వెగ్గలం జానకిరాములు తల్లిదండ్రులు రత్నమ్మ, బ్రహ్మయ్యలు వయోభారంతో వచ్చిన అనారోగ్యంతో మృతి చెందారు. వారి జ్ఞాపకార్థం వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు భోజనాలను పెడుతున్నారు. అలాగే వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది నుంచి పేదలందరికి ఉచితంగా ప్రథమ చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ఎన్ని చేసినా తల్లిందండ్రుల రుణం తీర్చుకోలేనిదని, అందు కోసం తనవంతుగా పేదలకు సహాయం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## స్కూల్‌కు ఫర్నిచర్.. పిల్లలకు క్రీడాదుస్తులు



స్కూల్ పిల్లలకు క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న భీంరెడ్డి

వర్గల్(గజ్వేల్): మండలంలోని గోవిందాపూర్‌కు చెందిన చింతకుంట భీంరెడ్డి తమ తల్లిదండ్రులు ఎల్లారెడ్డి–లక్ష్మీ దంపతుల జ్ఞాపకార్థం గ్రామంలోని ప్రభుత్వ బడిలోని పిల్లలకు శనివారం రూ.25 వేల విలువైన క్రీడాదుస్తులు అందజేశారు. ఇదే పాఠశాలలో పిల్లలు కూర్చునేందుకు డెస్కులు తదితర రూ.ఒకటిన్నర లక్షల విలువైన ఫర్నిచర్‌ను సైతం పంపిణీ చేశారు. తల్లిదండ్రుల పేరిట చేసే కార్యక్రమాలు సంతృప్తినిస్తున్నాయని భీంరెడ్డి పేర్కొన్నారు.

## తల్లిదండ్రులకు గుడి కట్టించాడు

వర్గల్(గజ్వేల్): మండలంలోని గుంటిపల్లికి చెందిన పూస నర్సింహులు తన తల్లిదండ్రులు మదిలో చిరస్మరణీయంగా నిలిచిపోయేలా వారి విగ్రహాలతో గుడి కట్టించాడు. వారిపై తనకున్న ఆప్యాయత, అనురాగం, ఆత్మీయ బంధాన్ని చాటుకున్నాడు. ఆయన తండ్రి బాలయ్య 2009, సెప్టెంబర్ 25న మృతిచెందాడు. తల్లిదండ్రులకు ఏలోటు రాకుండా వృద్ధాప్యంలోనూ జాగ్రత్తగా చూసుకున్న ఆయన.. తండ్రి మరణించిన తరువాత వారిని ఎల్లవేళలా స్మరించుకునేలా తన పొలం వద్ద గుడి కట్టించి అందులో తండ్రి విగ్రహం ఏర్పాటు చేశాడు. ఆ తరువాత 2024, జూలై 17న తల్లి బాలమ్మ మృతి చెందగా ఆమెకు విగ్రహాన్ని తయారు చేయించాడు. ప్రతి సంవత్సరం దీపావళికి తల్లిదండ్రుల గుడికి వెళ్లి నైవేద్యం పెట్టి ఆశీస్సులు తీసుకుంటాడు. ఏదైనా శుభకార్యం జరిగినా, ఏ పని చేసినా వారి ఆశీర్వాదం తీసుకుంటానని చెప్పాడు.

## తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవం..



తల్లిదండ్రుల విగ్రహాలకు మొక్కుతున్న నీలం

పటాన్‌చెరు టౌన్: తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవం అని మన అందరం చెప్పుకుంటాం. తల్లిదండ్రులు మరణించిన తర్వాత వారి జ్ఞాపకార్థం విగ్రహాలను ఏర్పాటు చేసి వారిపై ఉన్న ప్రేమను చాటుకుంటున్నారు కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్‌కు చెందిన ఆయన తల్లిదండ్రులు నీలం నిర్మల్, నీలం రాధ. ఇద్దరు 2021లో కోవిడ్ బారిన పడి ఒక రోజు వ్యవధిలోనే మృతి చెందారు. దీంతో తల్లిదండ్రులను కోల్పోయిన ఆయన వారిద్దరి విగ్రహాలను చిట్కుల్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ప్రతిరోజు తల్లిదండ్రుల విగ్రహాలను దర్శించుకున్న అనంతరం పనులను ప్రారంభిస్తున్నట్లు నీలం మధు పేర్కొన్నారు.

## సేవే పరమావధిగా..



న్యాల్‌కల్ సంతలో మేలు రకం పశువులను ఎంపిక చేస్తున్న బస్వరాజ్, రైతులు(ఫైల్)

న్యాల్‌కల్(జహీరాబాద్): సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌కు చెందిన ప్రముఖ కళాకారుడు హోతి బస్వరాజ్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. తల్లిదండ్రులు హోతి గిరిజాబాయి–అడివప్ప స్మారకార్థం ప్రతి ఏటా న్యాల్‌కల్ గ్రామ సమీపంలో నిర్వహించే ఉర్సె షరీఫ్ పీర్‌గైబ్ సాహెబ్ జాతరలో జరిగే పశువుల సంతలో మేలు రకం పశువులకు బహుమతులు ప్రదానం చేస్తున్నాడు. తరిగిపోతున్న పశు సంపదను పెంచేందుకు 18 ఏళ్ల నుంచి తన వంతు కృషి చేస్తున్నాడు. అంతే కాకుండా తల్లిదండ్రుల స్మారకార్థం హైదరాబాద్‌లో ఆసక్తి గల పలువురు యువకులకు ఉచితంగా విగ్రహాల తయారీని నేర్పుతూ కళాకారులుగా తీర్చిదిద్దుతున్నాడు.

## నాన్నంటే చాలా ప్రేమ..



విద్యార్థిని సన్మానించి నగదు అందజేస్తున్న డా.నరేందర్

వెల్దుర్తి(తూప్రాన్): నాన్నంటే నాకు చాలా ప్రేమ..తను కష్టపడి నన్ను చదివించగా నాన్న కోరిక మేరకు ప్రభుత్వ ఉద్యోగం సాధించానని డా.నరేందర్ పేర్కొన్నారు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఫిజియోథెరపిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2020లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో వారి తండ్రి కట్లె సత్తయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో తన తండ్రి జ్ఞాపకార్థం 2021లో కట్లె సత్తయ్య మెమోరియల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి ప్రతియేటా తాను చదువుకున్న వెల్దుర్తి జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు, పోటీ పరీక్షల్లో ప్రతిభచాటిన వారికి నగదు సాయం చేస్తున్నాడు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు, ఫిజియోథెరపీపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులతో పాటు ఇతరులకు అన్నదాన కార్యక్రమాలు చేస్తున్నాడు.



# బైక్‌తో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి..

### వ్యక్తి మృతి

జిన్నారం (పటాన్‌చెరు): ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ఒకరు మృతి చెందారు. ఈ ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి వివరాల ప్రకారం... మేడ్చల్ జిల్లా గాగిల్లాపూర్‌కు చెందిన అంకన్నగారి శివరాములు (39) ఓ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 18న మధ్యాహ్నం నాగేశ్వర్‌రావుతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గడ్డపోతారం పట్టణ పరిధిలోని అలీనగర్ వద్ద ఓ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాలు కాగా ఇద్దరిని ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శివరాములు శనివారం మృతి చెందాడు. నాగేశ్వరరావు చికిత్స పొందుతున్నాడు. మృతుడి కుమారుడు ఆగ్నేశ్వర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

## వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఓ యువకుడు అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... హైదరాబాద్ మీర్‌పేటకు చెందిన శ్రీచక్రారెడ్డి(24) బీ.టెక్ పూర్తిచేసుకుని ఉద్యోగం కోసం వెతుకుతున్నాడు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 22న ఇంటర్వ్యూ కోసమని పటాన్‌చెరుకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. అతని స్నేహితుడిని అడుగగా ఇంటర్వ్యూ కోసం పటాన్‌చెరుకు వెళ్లాడని తెలిపాడు. పటాన్ చెరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**జహీరాబాద్‌లో వృద్ధుడు...**

జహీరాబాద్ టౌన్: వృద్ధుడు అదృశ్యమయ్యాడు. రూరల్ ఎస్ఐ.కాశీనాథ్ వివరాల ప్రకారం.. ఝరాసంగం మండలం పోట్‌పల్లికి చెందిన ముంగి రాములు(75) ఈ నెల 23న సాయంత్రం 6 గంటల ప్రాంతంలో బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ తెలియలేదు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## మూడు ఇసుక డంపుల స్వాధీనం

### ముగ్గురిపై కేసు నమోదు

బెజ్జంకి(సిద్దిపేట): గ్రామాల్లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా డంప్ చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సౌజన్య తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని తోటపల్లిలో దాడి చేయగా ఒక డంప్‌లో 40 టన్నులు, మరో డంపులో 10టన్నుల ఇసుకను పట్టుకుని అనీల్, రాజయ్యలపై కేసు నమోదు చేశారు. వీరాపూర్‌లో సుమారు 80 టన్నులు ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకుని సమీకృత్‌పై కేసు నమోదు చేశారు.

## ట్రేడింగ్ పేరుతో సైబర్ మోసం

### రూ.23.99 లక్షలు పోగొట్టుకున్న ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: ట్రేడింగ్ పేరుతో సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తిని మోసం చేసి లక్షలు కొట్టేశారు. ఈ ఘటన పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి జూన్ 15న ఆన్‌లైన్‌లో ఇన్‌స్ట్రాగామ్ చూస్తుండగా ఇనిస్ట్యూషనల్ స్టాక్ ట్రేడింగ్ పేరుతో ఓ లింకు కనిపించింది. దానిపై క్లిక్ చేయగా నేరుగా వాట్సాప్ గ్రూప్ దాని అడ్మిన్ సహాయంతో ఆ గ్రూపులో చేరాడు. సానియా కపూర్ అనే ఓ మహిళ ఫోన్ చేసి పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయని చెప్పి, ఐడీని క్రియేట్ చేసింది. దీంతో తొలుత రూ. 2 వేలు పెడితే లాభాలు చూపారు. ఇలా అనేక సార్లు రూ. 23 లక్షల 99 వేలు పెట్టుబడి పెట్టాడు. లాభాలు వచ్చాయంటూ వాళ్లు క్రియేట్ చేసిన ఐడీ ఖాతాలో రూ.92,58,043 చూపిస్తూ వచ్చారు. విత్‌డ్రా చేసుకుంటానని అడుగగా వారు స్పందించలేదు. దీంతో మోసపోయినట్లు గుర్తించి బాధితుడు సైబర్ పోలీసులకు, శనివారం పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# పట్టపగలు రెండిళ్లలో చోరీ

- ఆరు తులాల బంగారం
- లక్ష రూపాయల నగదు అపహరణ



ఇంట్లో చిందరవందరగా పడేసిన వస్తువులు

హత్నూర( సంగారెడ్డి): పట్టపగలు ఇంటి తాళాలు పగలగొట్టి దొంగలు నగలు, నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మండలంలోని గుండ్ల మాచునూర్ గ్రామంలో జరిగింది. ఎస్సై శ్రీధర్ రెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన దాసరి లక్ష్మీనారాయణ ఉదయం కుటుంబీకులతో కలిసి మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలోని చాకరి మెట్ల ఆంజనేయ స్వామిని దర్శించుకోవడానికి వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికొచ్చే సరికి ఇంటి తలుపులకు వేసిన తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఆరు తులాల బంగారు నగలు, లక్ష రూపాయల నగదు అపహరణకు గురైనట్లు బాధితులు తెలిపారు. అలాగే అదే గ్రామానికి చెందిన శేరి ఆంజనేయులు కుటుంబీకులు ఉదయం ఇంటికి తాళాలు వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టడంతో పాటు బీరువాలో ఉన్న రూ.20 వేల నగదు అపహరణకు గురైనట్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో శనివారం ఎస్సై శ్రీధర్ రెడ్డి, క్లూస్ టీం, సిబ్బంది ఆ రెండు ఇళ్లను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు సేకరించారు.

**గజ్వేల్ పట్టణంలో మూడిళ్లలో...**

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని మూడిళ్లలో చోరీలు జరిగాయి. పోలీసుల వివరాల ప్రకారం... పట్టణంలోని అయ్యప్పకాలనీలో నివాసముండే పసునూరి నారాయణ–నవనీత దంపతులు తమ ఇంటికి తాళం వేసి ఇటీవల హైదరాబాద్‌లో ఉండే కొడుకు వద్దకు వెళ్లారు. శనివారం ఉదయం ఇంటి తాళం పగలగొట్టి ఉందని స్థానికులు చెప్పడంతో వచ్చారు. ఇంట్లోని రూ.95వేల విలువైన బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. అలాగే పట్టణానికి చెందిన మహ్మద్ షాదుల్లా శుక్రవారం రాత్రి గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న ఇంటికి తాళం వేసి పైఅంతస్తులో పడుకున్నాడు. ఉదయం లేచి చూసే సరికి తాళం పగలగొట్టి ఇంట్లోని బంగారు పట్టీలతో పాటు రూ. 5వేల నగదును అపహరించారు. అలాగే వాసవీనగర్‌లో నివాసముండే ఎండీ హనీఫ్ కుటుంబ సభ్యులు తమ స్వగ్రామం వెంకటాపూర్‌కు ఈనెల 20న వెళ్లారు. శనివారం ఉదయం ఇంటి తాళాలు తెరిచి ఉండటంతో స్థానికులు హనీఫ్‌కు విషయం చెప్పారు. అతను గజ్వేల్‌కు వచ్చి చూడగా బీరువాలో ఉన్న రూ.10వేల విలువైన వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధితులిచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.